సాక్షి
కామారెడ్డి
గురువారం । 16 । జనవరి । 2025



సర్వే పకడ్బందీగా..

రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపిక సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు సూచించారు.

- 9లో ▶



సొంతూరిలో పండుగ..

ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సంక్రాంతి స్వగ్రామంలో జరుపుకోవడం గొప్ప అనుభూతి అని మాజీ మంత్రి మండవ అన్నారు.

- 9లో ▶

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.6 /14.4

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొన సాగుతుంది.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



కామారెడ్డిలోని వీక్లీమార్కెట్‌లో ముగ్గు వేస్తున్న మహిళలు

- ఆకట్టుకున్న రంగవళ్లులు
- గాలిపటాలతో సందడి చేసిన యువత
- కనుమ సందర్భంగా రైతుల పూజలు

కామారెడ్డి టౌన్‌: సంక్రాంతి పండుగను జిల్లా ప్రజలు సంబరంగా జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ వేడుకలు ఘనంగా నిర్వమించారు. ఉదయాన్నే ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులను పోటాపోటీగా వేశారు. ముగ్గు మధ్యలో ఆవుపేడ గొబ్బెమ్మలు, గరక, పసుపు, కుంకుమలు వేసి పూజించారు. పిండి వంటలు చేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు. చిన్నారులు, యువత గాలిపటాలను ఎగరేసి ఎంజాయ్‌ చేశారు. వీధుల్లో గంగిరెద్దులు సందడి చేశాయి. జుక్కల్‌ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులు పొలాల్లో ధాన్యలక్ష్మిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. పాడిరైతులు, పశువుల కాపర్లు కనుమ రోజు ఎబిజ్‌ గాడ్‌(పశువుల దేవుడు) విగ్రహం తయారు చేసి పూజించారు.





కామారెడ్డి పట్టణంలో గాలిపటాలు ఎగురవేస్తున్న యువతులు, చిన్నారులు





ధాన్యలక్ష్మికి పూజలు చేస్తున్న రైతు కుటుంబం, కామారెడ్డిలో గంగిరెద్దుల సందడి

న్యూస్‌రీల్‌

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి



బాన్సువాడ రూరల్‌: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరపాలని బాన్సువాడ సబ్‌ కలెక్టర్‌ కిరణ్మయి సూచించారు. బుధవారం ఆమె బాన్సువాడలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులకు సర్వేపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం జనవరి 26నుంచి అమలు చేయాలని అనుకుంటున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్తరేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలకు లబ్ధిదారును ఎంపిక చేయడంలో అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలన్నారు. వ్యవసాయానికి యోగ్యం కాని భూములను, రాళ్ళు రప్పలున్న భూములను, సాగుచేసే భూములను ప్రత్యేకంగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

17 వరకు రేషన్‌ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్‌: రేషన్‌షాపుల ద్వారా జనవరి నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ ఈ నెల 17 వరకు కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటగా ఈ నెల 15 వరకు చివరి తేది అని ప్రకటించారు. సంక్రాంతి సెలవులు రావడంతో మరో రెండు రోజులు రేషన్‌ పంపిణీని గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

చైనా మాంజా నుంచి రక్షణకు తీగల ఏర్పాటు



కామారెడ్డి క్రైం: బైక్‌ నడుపుతున్న వారికి గాలిపటాలు ఎగరవేసే మాంజా దారం నుంచి రక్షణ కల్పించే విధంగా పట్టణ పోలీసులు బుధవారం ఓ వినూత్న ప్రయత్నం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆయా ప్రధాన కూడళ్ల వద్ద బైక్‌లకు ఇనుప తీగలను బిగించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. బైక్‌ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్‌ పెట్టుకోవాలన్నారు. చైనా మాంజాను వాడొద్దని కోరారు. మాంజా దారం వాహనదారులకు తగలకుండా ఇనుప తీగలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఎస్సై మహేష్‌, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కృష్ణ జింకకు గాయం



పిట్లం(జుక్కల్‌): మండలంలోని గద్దగుండు తండా సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని కృష్ణ జింకకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, గాయపడిన కృష్ణ జింకను అంబులెన్స్‌లో పిట్లం పశువైద్య ఆస్పత్రికి తరలించారు. పశువైద్యాధికారి సంతోష్‌ చికిత్స అందించారు. అనంతరం హైవే సిబ్బంది కృష్ణజింకను ఫారెస్ట్‌ అధికారులకు అప్పగించారు. గాయం తగ్గితే కృష్ణజింకను అడవిలో వదిలేస్తామని ఫారెస్ట్‌ అధికారులు తెలిపారు.

పుర‘పాలన’కు కౌంట్‌డౌన్‌!

- ఈ నెల 26తో ముగియనున్న పదవీకాలం
- ఇప్పట్లో మున్సిపల్‌ ఎన్నికలు లేనట్టే
- ప్రత్యేకాధికారులకు బాధ్యతలు అప్పగించే అవకాశం



ఇందుప్రియ, కామారెడ్డి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌



కామారెడ్డి మున్సిపల్‌ కార్యాలయం



గంగాధర్‌, బాన్సువాడ మున్సిపల్‌ చైర్మన్‌



పద్మ శ్రీకాంత్‌, ఎల్లారెడ్డి మున్సిపల్‌ చైర్మన్‌

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పుర'పాలన'కు కౌంట్‌డౌన్‌ మొదలైంది. పాలక వర్గాల పదవీకాలం మరో పది రోజులు మాత్రమే మిగిలింది. ఈ నెల 26 తో పాలకవర్గాల్లోని ప్రతినిధులు మాజీలు కానున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల పాలక వర్గాల పదవీ కాలం ముగిసినా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. ఇప్పుడు మున్సిపాలిటీల వంతొచ్చింది. ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపించడం లేదు. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లలాగే మున్సిపాలిటీలు ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలు ఉన్నాయి. 2020 జనవరి 22న మున్సిపల్‌ ఎన్నికలు జరిగాయి. 27న వార్డు కౌన్సిలర్లతో ప్రమాణం చేయించి చైర్మన్‌, వైస్‌ చైర్మన్ల ఎన్నిక నిర్వహించారు. కామారెడ్డిలో 49 వార్డుల్లో బీఆర్‌ఎస్‌ 23, కాంగ్రెస్‌ 12, బీజేపీ ఎనిమిది, స్వతంత్రులు ఆరు గెలుచుకున్నారు. చైర్‌పర్సన్‌గా బీఆర్‌ఎస్‌కు చెందిన నిట్టు జాహ్నవి, వైస్‌ చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందుప్రియ గెలుపొందారు. బాన్సువాడలో 19 వార్డులకు బీఆర్‌ఎస్‌ 16, కాంగ్రెస్‌ రెండు, స్వతంత్రులు ఒకటి గెలిచారు. చైర్మన్‌గా గంగాధర్‌, వైస్‌ చైర్మన్‌గా జుబేర్‌ ఎన్నికయ్యారు. ఎల్లారెడ్డిలో 12 వార్డులకు గాను టీఆర్‌ఎస్‌ తొమ్మిది, కాంగ్రెస్‌ మూడు గెలిచింది. చైర్మన్‌గా కుడుముల సత్యనారాయణ, వైస్‌ చైర్మన్‌గా ముస్త్యాల సుజాత విజయం సాధించారు.

బల్దియాల్లో మారిన బలాబలాలు

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడంతో దాని ప్రభావం మున్సిపాలిటీలపైనా పడింది. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో మూడు మున్సిపాలిటీలు కాంగ్రెస్‌ ఖాతాలో చేరాయి. కామారెడ్డి మున్సిపల్‌లో వైస్‌ చైర్‌పర్సన్‌ ఇందుప్రియతో పాటు మెజారిటీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌ గూటికి చేరారు. దీంతో చైర్‌పర్సన్‌ జాహ్నవిపై అవిశ్వాసం పెట్టి పదవి నుంచి దింపేశారు. వైస్‌ చైర్‌పర్సన్‌గా ఉన్న ఇందుప్రియ చైర్‌పర్సన్‌ అయ్యారు. వైస్‌చైర్‌పర్సన్‌గా ఉర్దొండ వనిత ఎన్నికయ్యారు. ఎల్లారెడ్డిలో చైర్మన్‌ సత్యనారాయణపై అవిశ్వాసం పెట్టారు. ఆయన స్థానంలో శ్రీకాంత్‌ చైర్మన్‌ అయ్యారు. వైస్‌చైర్మన్‌ మార్పు జరగలేదు. బాన్సువాడలో మాత్రం అవిశ్వాసం పెట్టలేదు. కానీ చైర్మన్‌ గంగాధర్‌ స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో వెంటే కాంగ్రెస్‌ పార్టీలో చేరిపోయారు. వైస్‌ చైర్మన్‌ జుబేర్‌ బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారు.

ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే..

మున్సిపాలిటీల ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదు. పాలక వర్గాల పదవీకాలం ముగియకముందే ఎన్నికలకు కసరత్తు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ సారి ఎలాంటి కసరత్తు మొదలుకాలేదు. ప్రభుత్వం కూడా ఎన్నికల నిర్వహణ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే స్థానిక సంస్థల్లో కీలకమైన పంచాయతీల పదవీకాలం ముగిసిన తర్వాత వాటికి ప్రత్యేక అధికారులను నియమించింది. అలాగే మండల, జిల్లా పరిషత్‌లకూ ప్రత్యేకాధికారులను నియమించింది. తాజాగా మున్సిపాలిటీలకూ ప్రత్యేక అధికారులను నియమించనున్నారు. దీంతో స్థానిక సంస్థలన్నీ ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లినట్టే. సహకార సంఘాల పాలక వర్గాల పదవీ కాలం కూడా వచ్చే నెలలో ముగియనుంది. కామారెడ్డి మున్సిపాలిటీకి అదనపు కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించే అవకాశాలున్నాయి. బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలకు ఆర్డీవోలను నియమించవచ్చని భావిస్తున్నారు.

చైనా మాంజాతో ముగ్గురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు





గాయపడిన జావిద్‌, ప్రవీణ్‌

కామారెడ్డి టౌన్‌/కమ్మర్‌పల్లి/నవీపేట: చైనా మాంజా కోసుకొని ఉమ్మడి జిల్లాలో ముగ్గురు గాయపడ్డారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌ తరలించారు. వివరాలు. కామారెడ్డి పట్టణంలోని ఇస్లాంపూర కాలనీకి చెందిన జావేద్‌ బుధవారం బైక్‌పై కోర్టు రోడ్డులో వెళ్తుండగా చైనా మాంజా అతని గొంతుకు అడ్డుగా వచ్చి కోసుకుంటూ వెళ్లింది. గొంతు లోపలి వరకు తెగింది. గాయపడిన ఆయనను స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్‌ చేశారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో చైనా మాంజాతో మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన ప్రవీణ్‌ గాయపడ్డాడు. ప్రవీణ్‌ మెట్‌పల్లి నుంచి ద్విచక్ర వాహనంపై తన మిత్రుడితో కలిసి తిమ్మాపూర్‌ వెళ్తుండగా కమ్మర్‌పల్లి యూనియన్‌ బ్యాంక్‌ దగ్గర తెగిపోయిన గాలిపటానికి ఉన్న చైనా మాంజా మెడకు చుట్టుకొని కోసుకుపోయింది. గాయం లోతుగా కావడంతో తీవ్ర రక్తస్రావం అయింది. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. నవీపేట మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌ కాలనీకి చెందిన అద్నాన్‌ గొంతుకు మంగళవారం చైనా మాంజాతో గాయమైంది. బాసర రహదారిపై బైక్‌పై వెళ్తుండగా కాళ్లు, మెడకు మాంజా చుట్టుకుని కింద పడ్డాడు. తప్పించుకునే ప్రయత్నం చేయగా గొంతుకు చైనా మాంజా కోసుకుంది.

కత్తెరతో జీజీహెచ్‌లో రోగి హల్‌చల్‌

- ఐసీయూ, ప్రసూతి విభాగంలో హంగామా
- పట్టుకొని కట్టేసిన సిబ్బంది



ఆస్పత్రిలో రోగిని కట్టేసిన సిబ్బంది

కామారెడ్డి టౌన్‌: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న ఓ రోగి కత్తెర పట్టుకొని గంట పాటు హల్‌చల్‌ చేశాడు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డిలోని పాత బస్టాండ్‌ ప్రాంతానికి చెందిన అవుసుల ప్రమోద్‌ ఈనెల 12న పురుగుల మందు తాగడంతో బంధువులు ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు చికిత్స అందించి ఐసీయూలో ఉంచారు. ప్రమోద్‌ మద్యానికి, కల్లుకు బానిస కావడంతో ఆస్పత్రిలో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించారు. దీంతో అతడి కాళ్లు చేతులు మంచానికి కట్టేసి చికిత్స అందిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున బాగా అరుస్తూ కట్లు విప్పుకొని నర్సింగ్‌ స్టాఫ్‌ టేబుల్‌పై ఉన్న సీజర్స్‌(కత్తెర) పట్టుకొని మొదట ఐసీయూలో హల్‌చల్‌ చేశాడు. తోటి ఇన్‌పేషంట్లను భయాందోళనకు గురి చేశాడు. అందరిని బెదిరిస్తూ ఐసీయూ నుంచి ప్రసూతి విభాగంలోకి వెళ్లి తలుపు పెట్టుకున్నాడు. అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది, కానిస్టేబుల్‌, సెక్యూరిటి లెబర్‌ రూం అద్దాన్ని పగులగొట్టి లోపలకు ప్రవేశించి అతన్ని పట్టుకున్నారు. చేతులు, కాళ్లు కట్టేసి చికిత్స అందించారు. ఈ ఘటనతో ఆస్పత్రిలో టెన్షన్‌ వాతావరణం నెలకొంది. ఎవరికి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం అతడి బంధువులు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు.

దీక్ష విరమించిన మాస్టర్‌ప్లాన్‌ బాధితుడు

- ఈ నెల 19 నుంచి 26 వరకు రైతు సమావేశాల ఏర్పాటుకు నిర్ణయం



శ్రీకాంత్‌రెడ్డితో దీక్ష విరమింపజేస్తున్న రైతులు

కామారెడ్డి టౌన్‌: మాస్టర్‌ ప్లాన్‌ను రద్దు చేయాలని మున్సిపల్‌ కార్యాలయం ఎదుట రెండు రోజులుగా చేపడుతున్న దీక్షను అడ్లూర్‌ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి బుధవారం విరమించారు. ఆయా గ్రామాల మాస్టర్‌ప్లాన్‌ బాధితులు దీక్ష శిబిరంలో శ్రీకాంత్‌తో మాట్లాడి చెరుకురసం తాగించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ మాట్లాడుతూ రైతులను నష్ట పరిచే కామారెడ్డి మాస్టర్‌ ప్లాన్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. రైతులు మాట్లాడుతూ గతంలో మాస్టర్‌ప్లాన్‌ రద్దు కోసం తీవ్ర ఉద్యమాన్ని చేశామని గుర్తు చేశారు. అప్పుడు మాస్టర్‌ ప్లాన్‌ను నిలిపేస్తున్నట్లు ప్రకటించారే తప్పా పూర్తిగా రద్దు చేయలేదన్నారు. రద్దు చేస్తూ జీవో విడుదల చేయాలని కామారెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలతో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీని కలుస్తామన్నారు. అప్పటికీ స్పందన రాకపోతే ఈ నెల 19 నుంచి 26 వరకు అడ్లూర్‌ఎల్లారెడ్డి, టేక్రియాల్‌, అడ్లూర్‌, లింగాపూర్‌, పాతరాజంపేట, రామేశ్వరపల్లి, సరంపల్లి, దేవునిపల్లి ఇలా రోజుకొక గ్రామంలో రైతులంతా సమావేశమై భవిష్యత్‌ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ప్రభుత్వం జీవో రద్దు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సంక్రాంతి కానుకగా పసుపు బోర్డు

- జిల్లాకు దక్కిన జాతీయ ఖ్యాతి
- ఢిల్లీనుంచి వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్రమంత్రి పీయూష్‌ గోయల్‌
- కేంద్ర మంత్రితో కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అర్వింద్‌
- రైతుబిడ్డకు దక్కిన గౌరవంగా భావిస్తా : జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌ పల్లె గంగారెడ్డి



పసుపు మొక్కలతో జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌ గంగారెడ్డి, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్‌

నిజామాబాద్‌ సిటీ : నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుతో జిల్లాకు అంతర్జాతీయ ఖ్యాతి దక్కింది. ఎన్నో ఏళ్లగా పసుపు రైతుల పోరాటానికి ఫలితం దక్కింది. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం ఢిల్లీ నుంచి ఎంపీ అర్వింద్‌తో కలిసి కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్‌ గోయల్‌ వర్చువల్‌గా ప్రారంభించారు. జాతీయ పసుపు బోర్డు తొలి చైర్మన్‌గా అంకాపూర్‌కు చెందిన బీజేపీ సీనియర్‌ నాయకుడు పల్లె గంగారెడ్డిని నియమించారు. నిజామాబాద్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యేలు ధన్‌పాల్‌ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌ రెడ్డి అధ్యక్షత వహించారు.బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌,బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, కేంద్ర అధికారులు పాల్గొన్నారు. పల్లె గంగారెడ్డిని పసుపు కొమ్మలతో చేసిన దండను బహూకరించారు. సుగంధ ద్రవ్యాలతో కూడిన ముడి పంటల కోసం ఏర్పాటు చేసిన జాతీయ స్పైసెస్‌ బోర్డు నుంచి పసుపును విడదీసి ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటుచేశారు. గుంటూరులో టొబాకో బోర్డు, కేరళలోని కొచ్చిలో స్పైసెస్‌ బోర్డు ఉంది. అదేవిధంగా పసుపు బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేశారు. ప్రపంచంలో పండించే పంటలో మన దేశంలోనే 62 శాతం పసుపు పంట పండుతోంది. దేశంలో మహారాష్ట్ర, తమిళనాడు తర్వాత నిజామాబాద్‌లోనే అత్యధికంగా పసుపు రికార్డుస్థాయిలో నాణ్యమైన పసుపు పండుతోంది. మన పసుపునకు ఇతర రాష్ట్రాల్లో బాగా డిమాండ్‌ ఉంది.

విధేయతకు దక్కిన గౌరవం..

పల్లె గంగారెడ్డి ఆర్మూర్‌ మండలం అంకాపూర్‌కు చెందిన రైతు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేశారు. విధేయతతో పార్టీకి అంకితభావంతో పనిచేసిన ఆయనకు జాతీయ పసుపుబోర్డు చైర్మన్‌గా అరుదైన గౌరవం దక్కింది.

పసుపు ఉత్పత్తులు బాగా పెరుగుతాయి

పసుపునకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయడంతో దేశీయంగా పంట ఉత్పత్తి, పసుపు ఆధారిత సేవలు పెరగుతాయని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్‌ గోయల్‌ అన్నారు. బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన అనంతరం ఆయన వర్చువల్‌లో మాట్లాడారు. బోర్డు నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేయాలని ఎంపీ అర్వింద్‌ ప్రధాని మోదీని సైతం ఒప్పించారన్నారు.

ప్రధాని మాట ఇస్తే నెరవేరుస్తారు

ప్రధాని నరేంద్రమోదీ వాగ్దానం ఇస్తే ఖచ్చితంగా అమలు చేసి తీరతారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ కుమార్‌ అన్నారు. ఆయన కరీంనగర్‌ నుంచి ఆయన వర్చువల్‌ కార్యక్రమంలో మాట్లాడారు. ఎంపీ అర్వింద్‌ కృషితోనే పసుపు బోర్డు సాధ్యమైందన్నారు.

రైతుబిడ్డకు దక్కిన గౌరవం

సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన తనను పసుపు బోర్డు చైర్మన్‌గా నియమించడం అదృష్టమని పల్లె గంగారెడ్డి అన్నారు. ఇది రైతు బిడ్డకు దక్కిన గౌరవమన్నారు.పార్టీకి రెండుసార్లు జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన తనకు పెద్ద బాధ్యత అప్పగించారని, సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు.

ప్రజలు రుణపడి ఉంటారు

ఇందూరు రైతుల చిరకాల వాంఛ నెరవేరిందని ఎంపీ అర్వింద్‌ మాట్లాడుతూ అన్నారు. పసుపు రైతుల సమస్యలను స్వయంగా చూసిన తాను ఎన్నికల సమయంలో పసుపు బోర్డు తెస్తానని బాండ్‌ పేపర్‌ రాసి ఇచ్చానని గుర్తు చేశారు. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటుకు అంగీకరించిన ప్రధాని నరేంద్రమోదీకి పాదాభివందనాలన్నారు. తెలంగాణ రైతులు ప్రధాని మోదీని జీవితాంతం గుర్తుపెట్టుకుంటారన్నారు.

జోరుగా వరినాట్లు



నిజాంసాగర్‌లో వరినారు తీస్తున్న మహిళా కూలీలు

నిజాంసాగర్‌/బీబీపేట: జిల్లాలో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో నాట్లు పూర్తవగా నిజాంసాగర్‌, పోచారం, కౌలాస్‌, సింగితం ప్రాజెక్టుల కింద ప్రస్తుతం రైతులు వరి నాట్లలో బిజీగా ఉన్నారు. యాసంగి సీజన్‌లో నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేయగా 3.5 లక్షల ఎకరాల్లో పంటల సాగు చేశారు. 2.9 లక్షల ఎకరాల్లో వరి వేస్తారని అంచనా వేయగా 2.4 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. నిజాంసాగర్‌, మహమ్మద్‌ నగర్‌, ఎల్లారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచ, బీబీపేట మండలాల్లో వరి నాట్లు ఆలస్యంగా చేపట్టినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మరోవైపు బీహార్‌, జార్ఖండ్‌ రాష్ట్రాలకు చెందిన కూలీలు వ్యవసాయ పనులు చేస్తుండటంతో స్థానిక మహిళా కూలీలకు డిమాండ్‌ తగ్గింది. ప్రస్తుతం కూలీల కొరత లేదని రైతులు అంటున్నారు.

క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి బస్ డిపో ఆవరణలో క్రికెట్ టోర్నమెంటును బ్యాటింగ్ చేసి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీ నిర్వహించడం సంతోషకరమని అన్నారు. టోర్నీ విజేతలకు రూ.12,777, రన్నర్‌లకు రూ.8,777 నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు కుర్మ సాయిబాబా తెలిపారు. కౌన్సిలర్ భూంగారి రాము, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, తదితరులున్నారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని సత్యం వెంచర్‌లో నేటి నుంచి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ తెలిపారు. గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.51వేలు, ద్వితీయ బహుమతిగా రూ.21 వేలు, తృతీయ బహుమతిగా రూ.11 వేలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



కామారెడ్డి అర్బన్: ఇటీవ ల నిర్వహించిన తెలంగా ణ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రికెట్ పో టీల్లో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్థులు దాసరి గోరఖ్‌నాథ్ (బీఏ తృతీయ), సాజీబ్ (బీఎస్సీ తృతీయ) ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయకుమార్, పీడీ శ్రీనివాస్‌రావు బుధవారం తెలిపారు. ఈనెల 18నుంచి చెన్నైలో నిర్వహించే దక్షిణ భారత జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో తెలంగాణ విశ్వవిద్యాలయం తరపున వారు పాల్గొంటారన్నారు.

పరుగు పందెంలో కామారెడ్డి జిల్లావాసి రికార్డు



బంగారు పతకంతో ప్రవీణ్

రామారెడ్డి: జార్ఖండ్ రాష్ట్రం రాంచీ లో జరుగుతున్న 68వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో అథ్లెటిక్స్ అండర్–14 విభాగంలో ఉప్పల్వాయి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి కొత్త రికార్డు సృష్టించాడు. క్రీడాకారుడు ప్రవీణ్ 100 మీటర్ల పరుగు పందెంను 11.39 సెకన్లలో పూర్తి చేసి బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి 100 మీటర్లు విభాగంలో కొత్త రికార్డు నెలకొల్పినట్టు కోచ్ సురేష్ తెలిపారు. క్రీడాకారుడిని ప్రిన్సిపల్ శివరామ్, వైస్ ప్రిన్సిపాల్స్ మోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, పీఈటి మహేష్, సిబ్బంది అభినందించారు

ఇందల్వాయి బస్టాండ్ తనిఖీ

ఇందల్వాయి: మండల కేంద్రంలోని బస్టాండ్‌ను ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, డిప్యూటీ ఆర్ఎం సరస్వతి, డీఎం సచ్చితానంద్ బుధవారం తనిఖీ చేశారు. బస్టాండ్ ప్రాంగణం శుభ్రంగా ఉండేలా చూడాలని కంట్రోలర్ దాసుకి సూచించారు. ఖాళీగా ఉన్న దుకాణాలను టెండర్ ద్వారా వ్యాపారస్తులకు కేటాయిస్తామని తెలిపారు. ఆమె వెంట ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సెలవుల్లో ఎడపల్లి ఎస్సై

ఎడపల్లి: మండల పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై వంశీచందర్‌రెడ్డి ఈ నెల 13 నుంచి నెల రోజుల పాటు వ్యక్తిగత సెలవుల్లో వెళ్లినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో ధర్పల్లి నుంచి ఎడపల్లికి ఎస్సైగా బదిలీపై వచ్చారు. నాటి నుంచి బదిలీ కోసం ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో ఎడపల్లి ఎస్సైగా విధుల నిర్వహణకు అనాసక్తిగా ఉన్నట్లు సమాచారం.



పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డికి బొకేను అందజేస్తున్న ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి



పల్లె గంగారెడ్డికి పసుపు మొక్కను అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి, నాయకులు

అట్టహాసంగా పసుపు బోర్డు ప్రారంభోత్సవం

జిల్లాకేంద్రంలోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన జాతీయ పసుపుబోర్డు ప్రారంభోత్సవం అట్టహాసంగా కొనసాగింది. కార్యక్రమాన్ని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా బీజేపీ ఎమ్మెల్యేలు, పలువురు అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ వర్చువల్‌గా పాల్గొని, పసుపు బోర్డును లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేశ్ కులాచారి, పార్టీ శ్రేణులు, పసుపు రైతులు తదితరులు పాల్గొన్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, కేంద్ర బృందం అధికారిణి



పల్లె గంగారెడ్డికి తిలకం దిద్దుతున్న బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ కార్పొరేటర్లు, మహిళా ప్రతినిధులు



పాల్గొన్న బీజేపీ నాయకులు, పసుపు రైతులు

20రోజుల్లో 20 టీఎంసీలు ఖాళీ

- ఎస్సారెస్పీలో వేగంగా తగ్గుతున్న నీటి మట్టం
- కాలువల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి పంటలకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటిమట్టం వేగంగా తగ్గుతుంది. ప్రాజెక్ట్ నుంచి ప్రస్తుత సంవత్సరం యాసంగి సీజన్‌కు గత నెల 25న అధికారులు నీటి విడుదలను ప్రారంభించారు. అప్పుడు ప్రాజెక్ట్‌లో 80.5 టీఎంసీల నీరు ఉండగా ప్రస్తుతం 60.65 టీఎంసీలకు పడిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 20 టీఎంసీల నీటిని వదిలారు. ప్రతి రోజు సగటున టీఎంసీ నీరు తగ్గేలా ప్రాజెక్ట్ అధికారులు నీటి విడుదలను చేపడుతున్నారు. ఇదే లెక్కన నీటి విడుదల జరిగితే ప్రాజెక్ట్ ఆయకట్టు చివరి వరకు నీరు అందడం కష్టంగా మారుతుంది.

కాకతీయకు తగ్గించి.. వరదకు కొనసాగించి..

ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్టు అధికారులు తగ్గించి.. మిగుల జలాలను వదులుటకు నిర్మించిన వరద కాలువ ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా 2500 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 5వేల క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది. ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 405 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 797క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా తాగు నీటి అవసరాల కోసం 231క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1084.20(60.65 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.



కాకతీయ కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



లక్ష్మణ్ దేశాయ్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): మండలంలోని సోనాల గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోజేగావ్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ దేశాయ్(39) మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గోజేగావ్ గ్రామానికి చెందిన సుబిత్రబాయి చిన్న కోడుకు లక్ష్మణ్ దేశాయ్ దేగ్లూర్‌లో ఫర్టిలైజర్ దుకాణం పెట్టుకున్నాడు. నిత్యం బైక్‌పై ఉదయం వెళ్లి రాత్రికి ఇంటికి తిరిగివస్తుంటాడు. ఈక్రమంలో బుధవారం దుకాణం వద్దకు బైక్‌పై వెళ్తుండగా సోనాల వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన లక్ష్మణ్‌దేశాయ్‌ను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించిన, అప్పటికే మృతిచెందాడు. లక్ష్మణ్‌దేశాయ్ మృతదేహాన్ని చూసిన తల్లి, భార్య, పిల్లల రోదనలు అందరిని కలిచివేశాయి. సంక్రాంతి పండగతో అందరితో కలిసి ఆనందంగా గడిపిన లక్ష్మణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొని..

పిట్లం(జుక్కల్): రోడ్డు పక్కన ఆగిన ఆటోను బైక్ ఢీకొట్టడంతో ఒకరు మృత్యువాత చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయిన ఘటన మండలంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని మద్దెలచెరువు గ్రామానికి చెందిన శ్రీనివాస్ (35) అతని బావ పురుషోత్తం ఇద్దరు కలిసి బైక్‌పై బాచిపల్లి నుంచి మద్దెలచెరువు గ్రామానికి బయలుదేరారు. సిద్ధాపూర్ గ్రామం వద్ద పిట్లం–బాన్సువాడ రోడ్డుపక్కన నిలిపి ఉన్న ఆటోను వారు వేగంగా వచ్చి ఢీకొన్నారు. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. పురుషోత్తంకు తీవ్ర గాయాలు అయ్యాయి. మృతుడి భార్య గంగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.



మృతి చెందిన శ్రీనివాస్

చికిత్స పొందుతూ ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ వ్యాధిగ్రస్తుడైన ఓ గుర్తుతెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ ఈనెల 7న మృతిచెందినట్లు ఒకటోటౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. ఆస్పత్రిలో అతడు నవంబర్ 15న అడ్మిట్ అయినట్లు తెలిపారు. వృద్ధుడు సుమారు 60ఏళ్ల వయస్సు ఉంటాడని, నలుపు రంగు స్వెటర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. భిక్షాటన చేసుకునే వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు. మృతుడికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినచో 8712659714కు గానీ, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లోగాని సంప్రదించాలన్నారు.

కోనాపూర్‌లో ఒకరి ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన సుబ్బాని అంజయ్య (57) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సుబ్బాని అంజయ్య కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నట్లు తెలిసింది. వ్యాధి బాధను భరించలేక జీవితంపై విరక్తి చెంది, ఇంట్లో పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అదేరోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు బాన్సువాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్సాపల్లిలో ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలోని ఇటుకబట్టిలో పనిచేస్తున్న చల్ల సీనమ్మ(45) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ బుధవారం తెలిపారు. భార్యభర్తల మధ్య మంగళవారం రాత్రి గొడవ కావడంతో మనస్తాపానికి గురికావడంతో సీనమ్మ పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

పేకాడుతున్న 9మంది అరెస్టు

ఖలీల్‌వాడి/ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి పేకాడుతున్న తొమ్మిది మందిని పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ఏసీపీ సీసీఎస్ నాగేంద్రచారి ఆధ్వర్యంలో సీఐ అంజయ్య, సీసీఎస్ సిబ్బంది పేకాట స్థావరంపై దాడిచేసి, తొమ్మిదిమందిని పట్టుకున్నట్లు తెలిపారు.అలాగే వారినుంచి రూ.22,750 నగదు,తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఒకరి అదృశ్యం



పీరాజీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఆదర్శనగర్‌కు చెందిన చవాన్ పీరాజీ(47) ఆదృశ్యం అయినట్లు ఎస్సై హరిబాబు బుధవారం తెలిపారు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెతికిన అతడి ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెద్దమల్లారెడ్డిలో బైక్ దహనం



పెద్దమల్లారెడ్డిలో దహనమైన బైక్

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఒక బైక్‌కు నిప్పు పెట్టి దహనం చేశారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ముదాం బాల్‌రాజు సోమవారం రాత్రి తన ఇంటి ముందర తన బైక్‌ను పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి దాటక గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌కు నిప్పంటించారు. దీంతో బైక్‌తో పాటు ఇంటికి కూడ నిప్పు అంటుకుంది. ఇంట్లోని వారు గమనించగా వారు బయటకు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే బైక్ పూర్తిగా కాలిపోయింది. బాధితులు మంగళవారం భిక్కనూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు.

సారంగాపూర్‌లో అగ్నిప్రమాదం

నిజామాబాద్ రూరల్: రూరల్ పరిధిలోని సారంగాపూర్ ఇండస్ట్రీయల్ ఏరియాలో బుధవారం ఓ దుకాణదారుడు షాపులోని చెత్తను బయటపడేసి నిప్పుపెట్టాడు. అతడి అజాగ్రత్తతో నిప్పు చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించింది. దీంతో సారంగాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆశోక్ నగరంలోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా, వారు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఈఘటనలో మేక మృతిచెందగా, ఓ బాలుడి కాలిగి గాయమైంది. ఇన్‌చార్జి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, లీడింగ్ ఫైర్‌మెన్ అనంతరావు, ఫైర్‌మెన్లు హరి, జయంత్, సతీష్, బస్వరాజ్, ఫైర్ ఇంజన్ సిబ్బంది ఉన్నారు. ఈ విషయపై 6వ టౌన్ పోలీసులను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో కాంగ్రెస్ నాయకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో ప్రారంభించిన మండలస్థాయి క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. పోచారం జట్టు ప్రథమస్థానంలో, జప్తి జాన్కంపల్లి జట్టు ద్వితీయస్థానంలో నిలిచాయి. విజేతకు రూ.7,777నగదు , రన్నర్‌కు రూ.5,555నగదును అందజేశారు.కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గర్గుల్‌లో ప్రీమియర్ లీగ్ విజేతలకు..



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్సై రాజు

కామారెడ్డి రూరల్: గర్గుల్‌లో జీపీఎల్ సీజన్–3లో విజేతగా నిలిచిన జట్టుకు దేవునిపల్లి ఎస్సై రాజు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు చింతల రవితేజ గౌడ్, నవీన్, మల్లేష్, అఖిల్, వినయ్ పాల్గొన్నారు.

విజేత విక్టరీ హంటర్స్



తాడ్వాయి: క్రికెట్‌లో విజేత విక్టరీ హంటర్స్ జట్టు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రారంభమైన మెట్టు చిన్న స్వామి జ్ఞాపకార్థం నిర్వహించిన టీపీఎల్ క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. విక్టరీ హంటర్స్ జట్టు విజేతగా నిలిచింది.

దేవునిపల్లి క్రికెట్ టోర్నీ విజేత ట్రిపుల్ ఆర్ జట్టు



విజేతకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లిలో దివంగత కాసర్ల శివరాజయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ బుధవారం సాయంత్రం ముగిసింది. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్ అతిథిగా హాజరై విజేత ట్రిపుల్ ఆర్ జట్టుకు ట్రోఫీని అందజేశారు. నిర్వాహకులు రవీందర్, రాంకుమార్, తదితరులున్నారు.

ఎంపీల కృషితోనే సాధ్యమైంది



విఠల్‌రావు, జెడ్పీ మాజీ చైర్మన్, నిజామాబాద్

నిజామాబాద్ రూరల్: మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, ప్రస్తుత ఎంపీ ధర్మపురి అర్వింద్ కృషి వల్లే నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు వచ్చిందని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. నగరంలో బుధవారం ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఎన్నోసార్లు కల్వకుంట్ల కవిత పసుపు బోర్డు ఏర్పాటు కోసం విన్నవించిందన్నారు. ప్రస్తుత ఎంపీ ధర్మపురి అర్వింద్ కృషి కూడా ఉందని గుర్తు చేశారు. జిల్లాకు పసుపు బోర్డు రావడం, అదేవిధంగా నిజామాబాద్‌కు చెందిన పల్లె గంగారెడ్డిని చైర్మన్‌ను చేయడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా పీఎం మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

గొడవలు సృష్టించాలనే వాల్‌పోస్టర్లు



నందిపేటలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నందిపేట్(ఆర్మూర్): ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన ఎమ్మెల్యేను రావద్దంటూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు గొడవలు సృష్టించాలనే ఉద్దేశంతో దొంగచాటున వాల్‌పోస్టర్లు అంటించారని బీజేపీ నాయకులు విమర్శించారు. నందిపేటలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు స్వచ్ఛభారత్ జిల్లా చైర్మన్ ఆదిమూలం వీరేశం డిమాండ్ చేశారు. దొంగచాటున వాల్‌పోస్టర్లు అంటించిన జోర్పూర్ రాము గతంలో ఇసపల్లి వద్ద ఎంపీ అర్వింద్ కాన్వయ్‌పై దాడి చేసి మారణాయుదాలతో హంగామా చేసిన ఘటన అందరికి తెలుసన్నారు. అతడిపై రౌడీషీటర్ ఓపెన్ చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పాలెం రాజు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పైన అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. దమ్ముంటే కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలపై నిలదీయాలని సీనియర్ నాయకులు లక్కంపల్లి చిన్నయ్య అన్నారు. సమావేశంలో నందిపేట, డొంకేశ్వర్ మండలాల నాయకులు పాల్గొన్నారు.

బుస్సాపూర్‌లో ఒకరి హత్య

- సిమెంట్ ఇటుకలతో తలపై మోదీ హతమార్చిన దుండగులు



బుస్సాపూర్‌లో హత్యకు గురైన దిలీప్‌శర్మ



హత్యకు వినియోగించిన సిమెంట్ ఇటుకలు

బాల్కొండ: ఒక వ్యక్తిని అతడి ఇంట్లోనే దారుణంగా హత్య చేసిన ఘటన మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రకు చెందిన దిలీప్‌శర్మ(38) గత పదేళ్ల క్రితం బుస్సాపూర్ గ్రామానికి వచ్చి స్థానిక ఆర్ఎంపీ దవాఖానా పక్కన గల మెడికల్ షాపులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మహారాష్ట్ర నుంచి బుస్సాపూర్‌కి వలస వచ్చిన సాగరికతో వివాహం జరిగింది. భార్య, పిల్లలను సోమవారం ఉదయం దిలీప్‌శర్మ సొంత గ్రామానికి పంపించగా, రాత్రి ఒక్కడే ఇంట్లో నిద్రించాడు. మంగళవారం ఉదయం దవాఖానకు వచ్చిన ఆర్ఎంపీ వైద్యుడు మెడికల్ షాపు తెరవకపోవడంతో దవాఖానా వెనుకగల గదిలో నివాసం ఉండే దిలీప్‌శర్మ గదికి వెళ్లాడు. తాళం ఉండటం, చెప్పులు గది బయట ఉండటం, సైకిల్ కూడ అక్కడే ఉండటంతో అదే గ్రామంలో ఉండే అత్తమామలను పిలిపించి అడిగి తెలుసుకున్నాడు. ఇంటికి రాలేదని చెప్పడంతో అనుమానంతో తాళం పగులగొట్టి చూడగా గదిలో విగత జీవుడై ఉన్నాడు. వెంటనే మెండోరా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి సిమెంట్ ఇటుక(తాబుకు)తో తలపై బలంగా మోదడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం దుండగులు గది బయట తాళం వేసి పరారయ్యారు. డాగ్ స్క్వాడ్ ఘటన స్థలం నుంచి ముప్కాల్ మండల కేంద్ర శివారులోని ఓ ఫంక్షన్‌హాలు వరకు వెళ్లి వెనుదిరిగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలో కండోమ్ ప్యాకెట్లు పడి ఉండటంతో హత్యకు అక్రమ సంబంధమే కారణమా అనే కోణంలో పోలీసులు ధర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఫైనాన్స్ వ్యాపారం కూడ నిర్వహించడం వల్ల ఏదైన ఆర్థిక లావాదేవీల్లో తేడాలు వచ్చి నిందితులు హత్యకు పాల్పడ్డరా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బైక్‌ల చోరీ నిందితుడి అరెస్టు

9 ద్విచక్రవాహనాలు రికవరీ

ఖలీల్‌వాడి: బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని అరెస్టు చేసినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నగరంలోని శాంతినగర్‌కు చెందిన షేక్ ఆదిల్(29)ను పట్టుకున్నారు. దొంగతనాలు చేసి జైలుకి వెళ్లివచ్చినా తన ప్రవర్తన మార్చుకోకుండా, పలు ప్రాంతాల్లో బైక్‌లు దొంగతనాలు చేస్తుండటంతో అదుపులోకి తీసుకున్నారు. దొంగతనాలు ఒప్పుకొని, చోరీ చేసిన బైకులు చూపించగా 9 బైక్‌లను రికవరీ చేశామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

జక్రాన్‌పల్లి మండలంలో..

జక్రాన్‌పల్లి: మండలంలో బైక్ చోరీకి పాల్పడిని నిందితుడిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని గాంధీనగర్‌కు చెందిన రాయికంటి గంగాధర్ బైక్ ఈ నెల 11న చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. కాగా బుధవారం మండలంలోని హైవేపై వాహనాలు తనిఖీ చేస్తుండగా దోమకొండకు చెందిన పల్లపు రమేష్ ను పోలీసులు పట్టుకున్నారు. విచారించగా చేసిన బైక్ చోరీ ఒప్పుకోగా బైక్‌ను స్వాధీనం చేసుకుని అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

నెంబర్ ప్లేట్ లేని 30 వాహనాలు సీజ్



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్సై చంద్ర మోహన్,రహ్మతుల్లా, సి బ్బంది నెంబర్ ప్లేట్ లేని 30వాహనాలను, 10అనధికార సైలెన్సర్‌తో శబ్ద కాలుష్యం చేస్తున్న మోటర్ సైకిళ్లను మంగళవారం సీజ్ చేశారు. వాటిని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. వాహనాల యజమానులకు జరిమానా విధించారు. అనంతరం ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన రైడర్స్‌కి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.